గ్రీన్ చానల్ ద్వారా అవయవాల రవాణా

శంషాబాద్: గ్రీన్‌చానల్ ద్వారా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కిమ్స్ ఆస్పత్రికి అవయవాలను రవాణా చేశారు. ఆదివారం రాత్రి 6ఈ–216 విమానంలో విశాఖపట్నం నుంచి తీసుకొచ్చిన ఊపిరితిత్తులు రాత్రి 9 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరకున్నాయి. ఎయిర్‌పోర్టు నుంచి గ్రీన్‌చానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో ట్రాఫిక్ క్లియరెన్స్ చేపట్టి 30 నిమిషాల్లోపు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ

రాజేంద్రనగర్: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని ఓ దొంగ నిమిషాల వ్యవధిలో దొంగలించి పారిపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్ హనుమాన్ దేవాలయం ప్రాంతంలో మసూద్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగం నిర్వహించే మసూద్ ఈ నెల 8వ తేదీన రాత్రి విధులు నిర్వహించుకొని తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేసి లోనికి వెళ్లాడు. లోపలికి వెళ్లిన 15 నిమిషాల అనంతరం బయటికి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని కేవలం నిమిషాల వ్యవధిలోనే తీసుకొని ఉడాయించాడు. ఈ దొంగతనానికి సంబంధించిన పూర్తి దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఫ్లైట్‌లో ప్రయాణికుడికి అనారోగ్యం

శంషాబాద్: విమానంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురికావడంతో విమానం తిరిగి వచ్చి ఆలస్యంగా బయలుదేరిన సంఘటన ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం 6ఈ–6223 విమానంలో 166 మంది ప్రయాణికులతో సాయంత్రం 3.55 గంటలకు బిహార్ రాజధాని పాట్నాకు టేకాఫ్ తీసుకుని బయలుదేరింది. కొద్ది నిమిషాల అనంతరం 11ఈ సీటులో కూర్చున్న ప్రయాణికుడు సంతోష్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాటు వాంతులు చేసుకోవడంతో వెంటనే పైలట్ అధికారుల అనుమతితో ఎయిర్‌పోర్టులో 4.15 గంటలకు తిరిగి ల్యాండ్ చేశారు. అస్వస్థతకు గురైన ప్రయాణికుడికి ఆస్పత్రికి తరలించారు. తిరిగి విమానం సాయంత్రం 5.56 గంటలకు 165 మంది ప్రయాణికులతో పాట్నా బయలుదేరింది.

రాజాసింగ్‌పై ఫిర్యాదు

గోల్కొండ: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై పలువురు ముస్లింలు టోలిచౌకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం జిబ్రాన్, షాహిన్‌షా టోలిచౌకి ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్‌ను కలిసి రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. సాబేర్‌ఖాన్, అఫ్సర్ జాహి, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడుతున్న రహదారి..!

- బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- వాహనదారులకు శాపం

శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనుల్లో జాప్యం నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొండుపల్లి రైల్వే వంతెన సమీపం నుంచి పాల్మాకుల వరకు మండల పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పనులను ప్రారంభించి దాదాపు మూడేళ్లు గడిచినా... ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ఈ రహదారిపై రాత్రి సమయంలో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయమవుతోంది.



పెద్దషాపూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులు

ఆరు వరుసలుగా...

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని ఆరు వరుసలకు విస్తరించడానికి సుమారు రూ. 540 కోట్లు కేటాయించారు. ఈ పనులను 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి ఘడ్కరీ ప్రారంభించారు. ఆరంభంలో పనులు జోరుగా సాగినా.. మధ్యలో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. అడపాదడపా అక్కడక్కడ పనులు చేస్తూ.. కాలం సాగదిస్తున్నారు.



పాల్మాకుల వద్ద బోల్తా పడిన లారీ(ఫైల్)

ప్రమాదాలతో ప్రాణాలకు ముప్పు...

విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కాలంలో పదుల సంఖ్యలో వాహనదారుల ప్రాణాలు గాల్లో కలిసాయి. ఇక గాయాలై ఆస్పత్రి పాలైన వాహనదారులు చాలా మంది ఉన్నారు.

- రెండు నెలల కిందట మదన్‌పల్లి శివారులో రహదారిపై బైక్ మీద వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు పక్కన నిర్మాణ సామగ్రిని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందారు.
- పాల్మాకుల శివారులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి రహదారిపై జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.
- ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనాలు మరమ్మతులకు గురైనా రోడ్డుపై గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. రాత్రి వేళల్లో జరిగే ఘటనలతో వాహనదారులు చాలా అవస్థలు పడుతున్నారు.



మదన్‌పల్లి శివారులో అసంపూర్తిగా రోడ్డు పనులు

పనులను వేగంగా పూర్తి చేయాలి



రహదారి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి. ఈ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– పి.శ్రీనివాస్‌రెడ్డి, పాల్మాకుల

శారదాధామం అభివృద్ధికి కృషి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ శారదాధామంలో పూర్వ విద్యార్థుల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజనకులు బొడ్డు శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అనేక రంగాలలో దేశానికి, సమాజానికి సేవలు అందిస్తున్నారన్నారు. పాఠశాలలో మౌలిక వసతులు అభివృద్ధికి కూడా తాము చదువుకున్న పాఠశాల మిగతా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉండాలన్న ఉద్దేశంతో సహకారం అందిస్తూ పాఠశాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేయడం ఆనందదాయకమన్నారు. మన పాఠశాలను ఇంకా అభివృద్ధి చేసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థి పూలపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ కార్యదర్శి సభ్యులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొడ్డు శ్రీనివాస్

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న శేఖర్‌ముదిరాజ్

బండ్లగూడ: కాలనీ అభివృద్ధి కోసం కాలనీ వాసులంతా ఏకంగా ముందుకు వచ్చి అభివృద్ధి పరచుకోవడం అభినందనీయమని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, బండ్లగూడ కార్పొరేషన్ బీజేపీ సీనియర్ నాయకులు నిరుడు శేఖర్‌ముదిరాజ్ వెల్లడించారు. ఆదివారం కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ కాలనీ అసోసియేషన్ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్‌ను కలిసి కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. అదంకు ఆయన స్పందించి కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ భద్రత కోసం కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శేఖర్‌ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాబురావు, ఉపాధ్యక్షులు లింగంరాజు, గోవింద్, కృష్ణారావు, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు వెంకటేశ్వర్లు, రమేష్‌గౌడ్, జి.రమేష్, దాల్‌నాయుడు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పాడు చేశారంటూ కారు డ్రైవర్‌పై ఫిర్యాదు

మణికొండ: భారీ వర్షాలతో గుంతల మయంగా మారిన రోడ్డు పనులను ఓ వైపు చేస్తుండగానే ఓ కారు దానిపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. దాంతో ఇంజనీరింగ్ అధికారులు కారు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కారును పోలీసులకు అప్పగించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పాత ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా నుంచి మర్రిచెట్టు వైపు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారటంతో రెండు రోజులుగా కొత్త రోడ్డు పనులను చేపడుతున్నారు. ఆ విషయం గమనించకుండా ఆదివారం ఉదయం ఓ కారు వేస్తున్న రోడ్డుపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. విషయం తెలుసుకుని మణికొండ మున్సిపల్ డీఈ శివసాయి సదరు కారు యజమానిపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసి కారును వారికి అప్పగించినట్టు తెలిపారు. ప్రజలందరికీ అవసరమయ్యే పనులను చేపడుతున్నపుడు వారు సహకరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పది రోజుల పాటు సదరు రోడ్డును మూసి ఉంచుతున్నామని, ప్రయాణికులు ఇతర రోడ్ల ద్వారా వెళ్లాలని ఆయన కోరారు.



వేస్తున్న రోడ్డుపైకి వచ్చిన కారు

రుహాన్సీ శామ్యూల్‌కు జీవిత సాఫల్య పురస్కారం

గన్‌ఫౌండ్రీ: ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్, యూనెస్కోల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక వేత్త ప్రొద్దుటూరి రుహాన్సీ శామ్యూల్ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నారు. సమాజ సేవ, మహిళా శక్తి అభివృద్ధి, విద్యారంగం, సామాజిక అవగాహన కోసం చేస్తున్న విశేష కృషికి గాను ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అంతర్జాతీయ సంస్థలు తన సేవను గుర్తించి పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా సమాజ సేవా చేస్తానని తెలిపారు.

ముగిసిన టూరిజం పోలీసుల శిక్షణ

రాయదుర్గం: టూరిజం పోలీసు విభాగానికి ఎంపికైన పోలీసులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం ఆదివారం ముగిసింది. 80 మంది టూరిజం పోలీసులకు గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్‌లో శిక్షణ ఇచ్చారు. గత రెండు రోజులుగా ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలలో పర్యటనలు నిర్వహించి వాటి ప్రాధాన్యతను వివరించి అక్కడ విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. యాదగిరిగుట్ట, భువనగరికోట, కొలనుపాక, గోల్కొండ, సెవెన్ టూంబ్స్, లుంబినిపార్కు, హుస్సేన్‌సాగర్ లేక్ బోటింగ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటి ప్రాధాన్యత, విధుల నిర్వహణపై నిథమ్ ఫ్యాకల్టీలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిథమ్ అధికారులు మాట్లాడుతూ టూరిజం పోలీసు విభాగం ఏర్పాటు చేయడం రాష్ట్రంలో మొదటిసారిగా నియామకాలు చేపట్టారన్నారు. మొదటి విడతలో 80 మందికి శిక్షణ ఇచ్చే అవకాశం నిథమ్‌కు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



యాదగిరిగుట్టలో టూరిజం, నిథమ్ అధికారులు

సమాజ సేవతో యువతకు గుర్తింపు

గోల్కొండ: సమాజ సేవతో యువతకు గుర్తింపు లభించడమే కాకుండా సమాజంలో గౌరవం పెరుగుతుందని ప్రముఖ ఎన్ఆర్ఐ ఖురేషి భాయ్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ అక్బర్‌పురాలో పీస్ ఫోర్స్ సొసైటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సమాజంలో వివిధ స్థాయిలో పని చేస్తున్న స్నేహితుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఖురేషి మాట్లాడుతూ..ఇటువంటి స్నేహ బృందాలు సమాజంలోని నిరుపేద వర్గాలకు అండగా ఉండి వారి పిల్లలు చదువుకునేందుకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. పీస్ ఫోర్స్ సొసైటీ చైర్మన్ మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ..పీస్ ఫోర్స్ సొసైటీని 15 ఏళ్ల క్రితం స్థాపించడం జరిగిందని కేవలం నిరుపేదలకు అండగా ఉండడానికి మాత్రమే ఈ సొసైటీ స్థాపించామన్నారు. ఈ కార్యక్రమంలో షేహబాజ్, ఇస్మాయిల్, సిద్ధిఖ్, బారి తదితరులున్నారు.

పల్స్‌పోలియో జయప్రదం

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యింది. వాడవాడలా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో మహమ్మారిని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన లభించింది.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



బండ్లగూడలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న కాంగ్రెస్ నేత సురేష్‌గౌడ్



శంసాబాద్‌లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ



పుప్పాలగూడలో మాజీ చైర్మన్ నరేందర్



గణేష్‌నగర్ పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



రాజేంద్రనగర్‌లో...





అత్తాపూర్‌లో కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్



హైదర్‌గూడలో ఆశావర్కర్ లక్ష్మి



కాటేదాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంఅండ్‌హెచ్‌వో లలితాదేవి



ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



శంషాబాద్ బస్టాప్‌లో మున్సిపల్ ఉద్యోగులు



బండ్లగూడలో మాజీ కార్పొరేటర్ పద్మావతి...



కాళీమందిర్ ప్రభుత్వ పాఠశాలలో...

ప్రమాదాల నిలయంగా మొండి కత్వ

- ప్రకృతి రమణీయం.. జలపాతం సొంతం
- సందర్శకుల చేపల వేటతో తరచూ ఇబ్బందులు
- ప్రాణాంతకంగా మారుతున్నా పట్టించుకోని ప్రజానీకం
- ఆరు నెలల్లో ఐదుగురు యువకుల మృత్యువాత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మొండి కత్వ జలపాతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో నిండుగా ప్రవహించే ఈ జలపాతాన్ని చూసేందుకు యువకులు వచ్చి మృత్యువాత పడుతున్నారు. నగరానికి చేరువలో జలపాతం ఉండటంతో సెలవు దినాలు, ఇతర రోజుల్లో ఇక్కడికి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఆరు నెలల్లో ఈ జలపాతం వద్దకు వచ్చి ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. ప్రతి సంవత్సరం ఇక్కడ ప్రమాదాలు జరుగుతుండటంతో పోలీసులు కంచె ఏర్పాటు చేసి ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఇక్కడికి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం సులేమాన్‌నగర్ ఫహాడీకి చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు తమ మరో నలుగురు స్నేహితులతో వచ్చి మృత్యువాత పడ్డారు.



చూసేందుకు అందంగా...

హిమాయత్‌సాగర్ నుంచి వచ్చే వరదనీటిని గతంలో స్థానికంగా ఉన్న పంట పొలాలకు మళ్లించేందుకు కిస్మత్‌పూర్, మొండి కత్వ వద్ద చెక్ డ్యామ్‌లను కట్టారు. ఇక్కడ నిలిచిన నీటిని పంట పొలాలకు మోటార్ల ద్వారా వినియోగించేవారు. మొండి కత్వ ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో ఆ కట్టపై నుంచి పడే వరదనీరు సుందరంగా కనిపిస్తుంది. ఈ జలపాతాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు తరలివస్తుంటారు. రోజూ ఈ జలపాతం పారుతుండటంతో కట్టతో పాటు కింద ఉన్న రాళ్లు, రప్పలు పూర్తిగా పాకురు పట్టాయి. దీంతో పాటు ఈ ప్రాంతంలో లోతు అధికంగా ఉంటుంది. రాళ్లు, రప్పలు ఉండటంతో ఇందులోకి దిగి ఈత కొట్టేందుకు వెళ్లిన వారు రాళ్లల్లో ఇరుక్కొని ప్రమాదాలకు గురవుతున్నారు.

ఫోటోలు, రీల్స్ కోసం...

నగరానికి చేరువలో ఈ వాటర్ ఫాల్స్ ఉండటంతో సెలవు దినాలు, హిమాయత్‌సాగర్ వరద గేట్లు విప్పిన సమయంలో ఈ జలపాతాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. కంచెను తొలగించి ఈ జలపాతం వద్దకు వస్తూ ఫోటోలు దిగుతూ రీల్స్ చేస్తూ సందడి చేస్తున్నారు. కొందరు మరింత ఉత్సాహంతో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫోటోలు, రీల్స్ కారణంగా ప్రతి సంవత్సరం ఒకరు, ఇద్దరు యువకులు మృత్యువాత పడుతున్నారు.

గస్తీ మరింత పెంచాలి...

మొండికత్వ జలపాతం ప్రమాదభరితంగా మారడంతో గత నాలుగు సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ పోలీసులు కంచెను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతానికి వెళ్లకుండా దారిని మూసివేశారు. స్థానికంగా ప్రమాద స్థలమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. హిమాయత్‌సాగర్ వరద గేట్లు వదిలిన సమయంలో కంచెను తొలగించి కొందరు ఈ ప్రాంతానికి వస్తున్నారు. వీరిని ఎప్పటికప్పుడు పోలీసులు బెదిరించి పంపిస్తున్నా... పోలీసుల కళ్లుగప్పి వస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీసులు మరింత గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.



మొండికత్వ వద్ద పోలీసులు, ప్రజలు